విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

## ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన నాదెండ్ల



**గుంటూరు,మే11 :** గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణలో 70 అర్జీలు వచ్చాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీ ఆర్ఎస్‌లో పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. తెనాలి మున్సిపల్ పరిధిలోని తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారి నుంచి ఆశీలు పేరిట జరిగే వసూళ్లను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రోజు నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. అర్జీలు మున్సిపల్ 42, పోలీసు 11, రెవెన్యూ 11, ఇతరాలు 6 వచ్చినట్లు మంత్రి చెప్పారు.

సంపుటి : 14 • సంచిక : 119 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 12 మే 2026 • పేజీలు : 8 • వెల 2/-

## ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

### కొత్త సిఎం విజయ్‌కు స్టాలిన్ హెచ్చరిక



**చెన్నై,మే11(చట్టం న్యూస్) :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేసి 24 గంటలు గడవకముందే ప్రతిపక్షాలు ఆయనపై విమర్శలకు దిగాయి. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే.స్టాలిన్ విజయ్ ప్రసంగాన్ని తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక పనితీరును విమర్శించడంపై సీఎం విజయ్‌ను హెచ్చరించారు స్టాలిన్. అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న విజయ్ మాటల్ని తప్పుబట్టిన ఆయన.. అబద్ధపు ప్రచారాలు ఆపాలంటూ చురకలంటించారు. 'ప్రభుత్వం వద్ద డబ్బులేదని వెంటనే చెప్పడం ప్రారంభించవద్దు. డబ్బు ఉంది.. కావాల్సింది

మిగతా 2వ పేజీలో..

## భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటింది

### శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి,మే11 (చట్టం న్యూస్) :** జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు, యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. పోఖ్రాన్ విజయంతో భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం

మిగతా 2వ పేజీలో..



## 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి

- జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోడీ
- ఏపిని కరువునుంచి రక్షించడంలో పోలవరం కీలకం
- కేంద్రమంత్రితో భేటీ అనంతరం మీడియాతో మంత్రి నిమ్మల

2లో..




## ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

- మరచిపోలేని అనుభూతిని పొందాం
- ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ భావోద్వేగం

**అమరావతి,మే11 (చట్టం న్యూస్) :** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ప్రధాని పర్యటనను ప్రత్యేకమైన సందర్భంగా వారు అభివర్ణించారు. ప్రధాని మోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తమ కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని, ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే సాయంత్రం ఇదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ రోజు తమ నివాసంలో ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం తమకు లభించిన గొప్ప గౌరవం, సంతోషమని చెప్పుకొచ్చారు. ఆప్యాయత, అనురాగంతో ప్రధాని తమతో గడిపిన ఈ సందర్భం తమ అందరికీ

మిగతా 2వ పేజీలో..



# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక

- పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు
- ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం
- అందరం కూడా దానిని అనుసరిస్తే మంచిది
- సవాళ్లను అధిగమించే సమయం ఇదే
- సిఐఐ సదస్సులో ఏపి సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ,మే11 (చట్టం న్యూస్) :** పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ,




పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు

మిగతా 2వ పేజీలో..

## జవాబుదారీతనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,మే11(చట్టం న్యూస్) :** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..

## కాజా టోల్‌గేట్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

- చిన్న కాకాని వద్ద ఇంటర్ ఛేంజ్ లేక సమస్యలు
- పలు రోడ్ల నిర్మాణాలపై గడ్కరీకి పెమ్మసాని వినతి
- రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ కొత్త రైల్వే లైన్
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన ఎంపి లావు



**న్యూఢిల్లీ,మే1 (చట్టం న్యూస్) :** కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమన్వయం చేస్తూ కాజా టోల్‌గేట్

మిగతా 2వ పేజీలో..

## పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

### సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో లోకేశ్ భేటీ



**అమరావతి,మే11 (చట్టం న్యూస్) :** సింగపూర్‌లోని పుంగోల్ తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జేఐఎస్‌సీ మద్దతుతో అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాజధాని అమరావతికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్

మిగతా 2వ పేజీలో..

## ఐదేళ్ల వైసిపి కాలంలో పోలీసులను రోడ్డున పడేశారు

- కంకిపాడులో పోలీస్ స్టేషన్ ప్రారంభించిన హోంమంత్రి
- లక్ష సిసి కెమరాల ఏర్పాటే లక్ష్యమని వెల్లడి



**విజయవాడ,మే11 (చట్టం న్యూస్) :** గత ఐదేళ్లు వైసీపీ హయాంలో పోలీసులను నడిరోడ్డుపై నిలబెట్టారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. సోమవారం పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు శాంతిభద్రతలపై దృష్టి సారించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 6000 మంది పోలీసులను భర్తీ చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలు తగ్గించడంలో కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని చెబుతూ.. ఎస్పీ, ఐజీని హోం మంత్రి అభినందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బందిని అనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ఇకపోతే

మిగతా 2వ పేజీలో..

## మహానాడుకు చురుకుగా ఏర్పాట్లు

### నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు,మే11 (చట్టం న్యూస్) :** ఈనెలాఖరులో ప్రారంభమయ్యే పార్టీ మహానాడుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం జరగనున్న కిసాన్ సేజ్ ప్రాంతాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరిశీలించారు. సభాప్రాంగణం, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేశారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో కీలక తీర్మానాలు చేస్తారని మంత్రి నారాయణ తెలిపారు. 'మహానాడు సుపరిపాలనకు దోహదపడే విధంగా నిర్వహించాలి. తొలి రెండు రోజులు పార్టీ డెలిగేట్స్‌తో, మూడో రోజు

మిగతా 2వ పేజీలో..

# 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి

**న్యూఢిల్లీ,మే11 :** పోలవరం ప్రాజెక్ట్ 2027 జూన్ నాటికి పూర్తవుతుందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయనున్నారని వెల్లడించారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలవరం కీలకమని మంత్రి తెలిపారు. వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్ట్‌ను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. సోమవారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. గంటపాటు సాగిన సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ సహా రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంపై మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశిరచిన గడువు ప్రకారం 2027 నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు చెప్పారు. పోలవరం సివిల్ వర్క్స్, ఆర్ అండ్ ఆర్ అంశాలను కేంద్ర మంత్రికి వివరించామన్నారు. తొలి దశలో




41.15 మీటర్ల ఎత్తుకు నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తి చేయడంలో కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారన్నారు. గత ఏప్రిల్ నాటికి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, వైసీపీ పాలనలో వాటిని పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. గత ఏడాది 19వ గేటు కొట్టుకుపోయిందని.. కొత్త గేట్ల ప్రారంభోత్సవంపై కేంద్ర మంత్రితో చర్చించామని వెల్లడించారు. గోదావరి కావేరి అనుసంధానం చేసుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మంత్రి తెలిపారు. గోదావరి కావేరి ఏ విధంగా ఇంటర్ లింకింగ్ చేయాలన్న దానిపైన యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గోదావరిలో ప్రతి సంవత్సరం సుమారు 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. ఈ మిగులు జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు లాభం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి చెబుతున్నారని తెలిపారు.
భూగర్భ జలాలను పెంపొందించేందుకు కార్యాచరణ చేపట్టామని రామానాయుడు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కలెక్టర్లతో గ్రౌండ్ వాటర్ సమస్యలపై సమీక్ష నిర్వహించారన్నారు. దేశంలో ప్రయోగాత్మకంగా ఎంసీఏడీ (ఓఅంఅ) మోడల్ సిస్టమ్‌ను విజయనగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆల్మట్టి ఎత్తు పెంపు నిర్మాణంపై సుప్రీం కోర్టులో స్టే ఆర్డర్ ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి అభ్యంతరాలపై చర్చించామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

# కాజా టోల్‌గేట్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

**మొదటి పేజి తరువాయి..**
సమీపాన నిర్మించిన వెస్ట్ బైపాస్ వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.
విజయవాడ వెస్ట్ బైపాస్ ఎన్‌హెచ్ - 16తో కలిసే చిన్నకాకాని జంక్షన్ వద్ద ప్రస్తుతం గ్రేడ్ సెపరేటెడ్ ఇంటర్‌చేంజ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పెమ్మసాని వివరించారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు హైల్యాండ్ ఫ్లై ఓవర్ కింద ఉన్న రెండు లైన్ల సర్వీస్ రోడ్, యూటర్న్ ద్వారా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం, లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో తెలుగుదేశం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పల్నాడు అభివృద్ధికి సంబంధించి కీలక రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడారు. పిడుగురాళ్ల - సావల్యపురం నుంచి రామాయపట్నం పోర్టుకు రైల్వేలైన్ నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రామాయపట్నం పోర్టు కనెక్టివిటీతో పల్నాడులో పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలపాలని విజ్ఞపి చేశారు. లింగంపల్లి -విజయవాడ ఎక్స్‌ప్రెస్ (12796) హాల్టింగ్ కోసం కేంద్రమంత్రికి ఎంపీ వినతిపత్రం అందజేశారు. విజయవాడ - బెంగళూరు మధ్య కొత్తగా వందేభారత్ రైలును ప్రారంభించాలని కోరారు. విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల సౌకర్యార్థం హైస్పీడ్ కనెక్టివిటీ అవసరమని తెలిపారు.
పిడుగురాళ్ల జంక్షన్‌ను రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ.. కొత్త రైల్వే లైన్ తీసుకురావాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం కేంద్రమంత్రిని ఆయన కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఓడరేవుకు రైలు మార్గాన్ని కలపడం ద్వారా.. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన పెరుగుతుందని వివరించారు. సిమెంట్, సున్నపురాయి, వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో స్టాపులు ఇవ్వాలని కోరారు. పల్నాడు నుంచి వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు ప్రస్తుతం ప్రధాన నగరాలకు వేగవంతమైన రైలు కనెక్టివిటీని పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు మధ్య విద్యార్థులు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, కుటుంబాల రాకపోకలు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కేంద్రమంత్రిని ఎంపీ కోరారు. ప్రతిపాదిత ఈ సర్వీసు ప్రయాణ సమయాన్ని తగ్గించి, రెండు ప్రాంతాల మధ్య హై-స్పీడ్ రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుందన్నారు. తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అభ్యర్థనలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపీ లావు ప్రతిపాదనలపై సానుకూలంగా రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. పల్నాడు ప్రాంత రైల్వే సమస్యల పరిష్కారానికి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు.

# భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటింది

**మొదటి పేజి తరువాయి..**
పోస్టు పెట్టారు. భవిష్యత్తు టెక్నాలజీల కోసం ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ఎకోసిస్టమ్ నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతను ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు భారీ స్థాయిలో డీప్‌టెక్ స్కిల్లింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. 2026-27 నాటికి రెండు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని 10 లక్షల మందికి విస్తరించే ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. డిజిటల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ట్రైనింగ్, గ్లోబల్ సర్టిఫికేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నీలిట్, ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కేంద్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులకు వరల్డ్ క్లాస్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎన్‌పిటెల్ జాతీయ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 4 గోల్డ్, 14 సిల్వర్ మెడల్స్ సాధించడం రాష్ట్ర ప్రతిభకు నిదర్శనమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీ కోర్సుల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. క్వాంటమ్ వ్యాలీ విజన్ ద్వారా భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధమయ్యే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, స్టార్టప్ అవకాశాలు, ఇండస్ట్రీ కనెక్టివిటీతో ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగిన మానవ వనరులను తయారు చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

**మొదటి పేజి తరువాయి..**
దానిని ప్రజలకు ఇవ్వాలనే సంకల్పం, పాలించే సామర్థ్యం. ఐదేళ్లుగా కొవిడ్, వరదల వంటి సంక్షోభాలు సహా కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పోరాడుతూనే.. మేం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశాం. 'గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి ఖజానాను ఖాళీ చేసింది' అనే ఆరోపణను మీ మొదటి ప్రసంగంలోనే ప్రస్తావించారు. నిజానికి రాష్ట్రంలో అప్పు పరిమిత స్థాయిలోనే ఉంది. ఫిబ్రవరి బ్జడెట్‌లోనే మేం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా వివరించాం. ఆ విషయం మీకు తెలియదా? మీకు ఓటు వేసిన ప్రజలను మోసం చేసి.. విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దు! 'ఆచరణాత్మకంగా సాధ్యమయ్యే వాగ్దానాలు మాత్రమే ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు.. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనను ప్రారంభిస్తున్నారు. మాలాగే మీరు కూడా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎలా నెరవేర్చాలనే మెళకువలను త్వరలోనే తప్పకుండా నేర్చుకుంటారని నమ్ముతున్నాను. మీకు ఓటు వేసిన ప్రజలతో పాటు నేనూ అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలని మరోసారి నా శుభాకాంక్షలు!' అని తన సందేశాన్ని ముగించారు స్టాలిన్. కాగా.. కేంద్రంలో డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ మద్దతుతో నిన్న(ఆదివారం) టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం విజయ్‌కు ఎక్స్ వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు స్టాలిన్. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే విజయ్ సంతకం చేసిన ప్రకటనలను కూడా ఆయన స్వాగతించారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం వంటివి ప్రధాన ప్రకటనలలో ఉన్నాయి.

# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

**మొదటి పేజి తరువాయి..**
నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠ భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. ఎంవోయూలోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు ఇటీవల సింగపూర్‌లో వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని గుర్తుచేశారు.

# ఐదేళ్ల వైసిపి కాలంలో పోలీసులను రోడ్డున పడేశారు

**మొదటి పేజి తరువాయి..**
ఉంగుటూరు మండలం ఆత్కూరులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... ఏపీలో గన్నవరం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. కోటి నలభై లక్షల రూపాయలతో ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఇంతకు ముందు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే పెచ్చులు ఊడి మీద పడే పరిస్థితి ఉండేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళుతున్నారని చెప్పారు. లక్ష సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ టార్గెట్ పెట్టుకొని 70 శాతం సక్సెస్ అయ్యామన్నారు. ఏదైనా నేరం జరిగిందంటే
24 గంటల్లోనే పోలీసులు కేసును ఛేదిస్తున్నారని హోం మంత్రి అనిత తెలిపారు. ఆత్కూరు గ్రామంలో సీసీ రోడ్లను మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పాల్గొన్నారు. అలాగే ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌ను మంత్రులు, ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. స్టేషన్‌లో హోంమంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

**మొదటి పేజి తరువాయి..**
వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# మహానాడుకు చురుకుగా ఏర్పాట్లు

**మొదటి పేజి తరువాయి..**
బహిరంగ సభగా జరగనుంది. బహిరంగ సభకు 7 లక్షల మందికి పైగా ప్రజలు రాబోతారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కమిటీల ప్రతినిధుల సమావేశంలో బాధ్యతలపై దిశా నిర్దేశర చేస్తాం. మహానాడును చరిత్రలో నిలిచేలా నిర్వహిస్తాం' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ..'సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించాం. మహానాడుకు సుమారు 6 వేల బస్సులు రావచ్చని అంచనా. పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. తెలుగు ప్రజల పండగ అయిన మహానాడును నిర్వహించే తొలి అవకాశం నెల్లూరు జిల్లాకు దక్కింది' అన్నారు. 'రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలంతా 26న మహానాడు ప్రాంగణానికి రానున్నారు. కమిటీల బాధ్యతలపై నిర్ణయాలు తీసుకుంటారు. కార్యకర్తలు ఈ మహానాడును ఇంటి కార్యక్రమంలా భావించి సమర్పణతో పనిచేయాలి' టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. కిసాన్ సేజ్‌లో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా పార్టీ నేతలందరూ తెలుగు పండగ విజయవంతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

# బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

**కోల్‌కతా,మే 11 :** పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్‌ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్‌ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

**మొదటి పేజి తరువాయి..**
ఎంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మోదీ అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి, మద్దతుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు చెప్పారు. హైదరాబాద్‌లోని తమ ఇంటికి ప్రధాని మోదీని స్వాగతించడం గొప్ప విశేషమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. మోదీ తమ కుటుంబానికి అందించిన ఆప్యాయత, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబంలోని మూడు తరాలు ప్రధానితో కలిసి ఉండటం ముఖ్యంగా గుర్తుండి పోయే మధుర జ్ఞాపకమని చెప్పుకొచ్చారు. మోదీ.. తన కుమారుడు నారా దేవన్ష్‌ను ఆశీర్వదించడం నిజంగా గొప్ప అదృష్టమని తెలిపారు. ఎప్పటిలాగే, తాను దేశంపై ఆయన అచంచలమైన నిబద్ధతతో ప్రేరణ పొందానని అన్నారు. ప్రజల సేవలో మరింత కష్టపడి తాను పనిచేయడానికి మోదీ నుంచి స్ఫూర్తి పొందానని తెలిపారు. ఇలాంటి క్షణాలు జీవితాంతం ఎంతో గుర్తుండి పోతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక



**మొదటి పేజి తరువాయి..**
ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

# ప్రార్థనా స్థలాల్లో లౌడ్ స్పీకర్ల గోల

### డిజిపికి లేఖ రాసిన డిప్యూటీ స్పీకర్

అమరావతి,మే 11(ఆర్ఎన్ఎ): ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్‌స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్దకాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని రఘురామ వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికార సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని రఘురామ కోరారు.

# కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన

### విమానం టేకాఫ్ అవుతుండగా దగ్గరగా వెళ్లిన వ్యక్తి

### వ్యక్తిని లాగేసుకున్న విమాన ఇంజన్

న్యూయార్క్,మే11 :అమెరికాలోని కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన జరిగింది. డెన్వర్‌లోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో రన్‌వే దాటుతున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా భద్రతా కంచెను దూకి విమానానికి అత్యంత సమీపంగా చేరుకున్నాడు. అదే సమయంలో టేకాఫ్ కోసం వేగం పెంచుతున్న ఎయిర్‌బస్ విమానం ఇంజిన్ అతడిని ఒక్కసారిగా లోపలకు లాగేసుకుంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడి శరీరం పైభాగం ఇంజిన్‌లో ఇరుక్కుపోవడంతో పరిస్థితి మరింత భయానకంగా మారింది. అనంతరం ఇంజిన్ నుంచి భారీగా మంటలు వెలువడ్డాయి. సమాచారం మేరకు ? ఈ ఘటన జరిగిన సమయంలో విమానం సుమారు గంటకు 139 మైళ్ల వేగంతో టేకాఫ్ దశలో ఉంది. ఈ దృశ్యాన్ని చూసిన విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్‌లో మనిషి కాళ్లు కనిపించడంతో పాటు పెద్ద శబ్దాలు, మంటలు వెలువడటంతో విమానంలో కలకలం రేగింది. తక్షణమే అప్రమత్తమైన సిబ్బంది టేకాఫ్‌ను నిలిపివేసి అత్యవసర చర్యలు చేపట్టారు. అనంతరం విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఫిట్‌నెస్‌కు ఆదర్శంగా నిలిచిన డా. అందే బుంగా తిరుపతి -- నాలుగోసారి హాఫ్ మారథాన్ విజయవంతం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 11,( చట్టం బ్యూరో )** : కరీంనగర్‌లో అవంతిక కన్స్ట్రక్షన్స్ తెలంగాణ రన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన హాఫ్ మారథాన్ రన్‌ను శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ ఒ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్ వృక్షశాస్త్ర విభాగ లెక్చరర్ డా. అందే బుంగా తిరుపతి విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన ఈ హాఫ్ మారథాన్‌ను వరుసగా నాలుగోసారి పూర్తి చేయడం విశేషంగా నిలిచింది. ఆరోగ్య పరిరక్షణ, క్రమశిక్షణ, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం మరియు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం మారథాన్‌లలో పాల్గొంటున్నట్లు తెలిపారు.




ప్రస్తుత కాలంలో అనారోగ్యకర జీవనశైలి, ఒత్తిడి, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం, నడక, పరుగులు వంటి శారీరక కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డా. తిరుపతి సూచించారు. ఫిట్‌నెస్ అనేది కేవలం క్రీడాకారులకు మాత్రమే కాకుండా ప్రతి వ్యక్తికి అవసరమని, ఆరోగ్యవంతమైన శరీరమే విజయానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా క్రీడలు, యోగా, మారథాన్‌ల వంటి ఆరోగ్యకర కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ డా. తిరుపతిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ, బోధనతో పాటు ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత, ఫిట్‌నెస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. అధ్యాపకులు తమ ఆచరణ ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, నేటి యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, డా. తిరుపతి సాధించిన ఈ విజయం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని, క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

టీ.జీ.సి.జి.టి.ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. డా. తిరుపతి నిరంతర కృషి, క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌పై ఉన్న ఆసక్తి యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు డా. రౌతు రాధాకృష్ణ, డా. పడాల తిరుపతి, డా. తాహేర్ హుస్సేన్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. ఆర్. శ్యామల చంద్ర తాజుద్దీన్, శ్రీమతి స్వరూపరాణి, హనీ సుల్తానా, ఎం.ఎస్సి విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు మరియు బోధనేతర సిబ్బంది పాల్గొని డా. తిరుపతికి అభినందనలు తెలియజేశారు.

# బీజేపీతో కాంగ్రెస్ కి రాజకీయ అక్రమ సంబంధం వల్లనే బండి భగీరత్‌ని అరెస్ట్ చేయడం లేదు

**బీఎస్పీ జోన్ చీఫ్ ఇంచార్జ్**

**అడ్వకేట్ నిషాని రామచంద్రం**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 11 ,(చట్టం బ్యూరో)** : బీజేపీ తో కాంగ్రెస్ కి రాజకీయ అక్రమ సంబంధం వల్లనే బండి భగీరత్ ని అరెస్ట్ చేయడం లేదు అని బహుజన్ సమాజ్ పార్టీ జోన్ చీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆరోపించారు. ఈ రోజు కరీంనగర్ లో పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ ఒక మైనర్ బాలిక ను శారీరకంగా వేదిస్తూన్నారని తన తల్లి చేసిన పిర్యాదు ను తీసుకోవడానికి కూడా పోలీస్ లు నిరకరించరన్నారు. నిందితుడు కేంద్ర సహాయ మంత్రి కొడుకు అయినందుకే పోలీస్ లు అరెస్ట్ చేయడం లేదన్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత కానీ తనం వల్లనే సాయి భగీరథ ను అరెస్ట్ చేయడం లేదన్నారు. ఈ రాష్ట్రం లో ఉన్న అధికార పార్టీ మహిళ మంత్రులు, బి ఆర్ ఎస్ మహిళా ఎమ్మెల్యే లు స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ మధ్యనే పార్టీ పెట్టుకున్న కవిత కూడా మాట్లాడక పోవడం సిగ్గు చేటు అని అన్నారు. రాష్ట్రం లో మహిళా కమిషన్ కళ్లు మూసుకొని నిద్రపోతుందా అని అన్నారు. భేటీ బచావో భేటీ పడావో అని రాజకీయ నినాదాలు ఇవ్వడం కాదు. దేశం లో బాలికలను మహిళలను కాపాడే ప్రభుత్వాలు అత్యాచారాలు చేసే నిందితులకు సహకరించడం సిగ్గు చేటు అని అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ సంఘటనకు నైతిక భాద్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పే మీరూ చట్ట ప్రకారంగా పని చేయడం లేదు కాబట్టి మీకు ఈ రాష్ట్రం ని పాలించే హక్కు లేదన్నారు. పోలీసులు నామ మాత్రమైన సెక్షన్ లు పెట్టి నిందితుడికి సహకరించడం అంటే మీరూ కూడా నేరస్తులే అని పోలీస్ వారిని సైతం ఘాటుగా విమర్శించారు. కరడు గట్టిన నేరస్తులను ఉగ్రవాదులను సైతం కొన్ని గంటల్లో అరెస్టు చేసే సమర్థ్యం ఉన్న పోలీస్ లు ఈ దుర్గటన లో నిందితుడిని అరెస్ట్ చేయక పోవడం అంటే పోలీస్ శాఖ మీద ఎంత రాజకీయ ఒత్తిడి ఉందొ అర్ధమవుతుందన్నారు. పోలీస్ శాఖ నిజాయితీ గా చట్టం ను అమలు చేయాలని లేకపోతే తెలంగాణా ప్రజల ద్రుష్టి లో మీ విలువలు పోతాయని అన్నారు. గతం లో నేరం రుజువు కాకముందే తుపాకీ తో కాల్చిన పోలీసులు ఈ ఘటన లో కనీసం నిందితుణ్ణి ఎందుకు అరెస్ట్ చేయలేకపోతున్నారు అని నిషాని రామచంద్రం ప్రశ్నించారు. ఇరవై నాలుగు గంటల్లో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి కొడుకు అరెస్ట్ చేయక పోతే బీఎస్పీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందన్నారు. ఈ పత్రిక సమావేశం లో బీఎస్పీ రాష్ట్రకమిటీసభ్యులు మాతంగి అశోక్ జోన్ ఇంచార్జ్ పల్లె ప్రశాంత్ గౌడ్, పార్లమెంట్ ఇంచార్జ్ లు కళ్లేపల్లి రాజేందర్, జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాళి తిరుపతి హుజురాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ అడ్వకేట్ కప్పా రవి కుమార్, కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లేందుల మహేష్, చొప్పదండి అసెంబ్లీ అధ్యక్షులు కాంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మార్కెట్‌ను రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలి

- **రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది..**
- **మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు**
- **దుద్దిల్ల శ్రీధర్ బాబు**
- **వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో మంత్రులను కలిసిన నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య**
- **కరీంనగర్ మార్కెట్ ఆధునీకరణ..**
- **డిజిటలైజేషన్.. రైతులకు సౌకర్యాల కల్పనపై మంత్రులతో చర్చించిన వెలిచాల..**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ మే 11, (చట్టం బ్యూరో)** : వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మార్కెట్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. రైతుల అభ్యున్నతి, మార్కెట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

సోమవారం హైదరాబాద్ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించిన ఆకుల నరసయ్య, తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రులు ఆకుల నరసయ్యకు అభినందనలు తెలిపారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ రైతులకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో మార్కెట్ కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మార్కెట్ యార్డులో ఆధునిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "వెలిచాల రాజేందర్ రావు సహకారంతో కరీంనగర్ మార్కెట్‌ను రాష్ట్రంలోని ఇతర మార్కెట్లకు ఆదర్శంగా నిలిపేలా అభివృద్ధి చేయాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలనీ, అవసరమైన నిధులు, పరిపాలనా సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని మంత్రులు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కరీంనగర్ మార్కెట్‌ను ఆధునికీకరించి రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

రైతులకు అండగా నిలుస్తామనీ, వారి సంక్షేమంలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు నిష్పక్షపాతంగా నిజాయితీగా సేవలందిస్తామని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య మాట్లాడుతూ, తనపై కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పారదర్శకంగా మార్కెట్ వ్యవహారాలను నడిపిస్తానని హామీ ఇచ్చారు.

కరీంనగర్ మార్కెట్‌లో మౌలిక సదుపాయాల విస్తరణ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, రైతులకు విశ్రాంతి గదులు, తాగునీరు, పారదర్శక తూకం వ్యవస్థ, డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై మంత్రులతో వెలిచాల రాజేందర్ రావు చర్చించారు. ఆయా అంశాలపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వేల్పుల వెంకటేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

------

# బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ద డా. సాయిప్రియకు ప్రతిష్టాత్మక అవార్డు




అగిరిపల్లి మండలం కనసనపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సైకాలజిస్టు డా. సాయిప్రియ పేట గారికి హైదరాబాద్‌లో నిర్వహించిన PA Decennary Awards Gala -- 2026" కార్యక్రమంలో Women Icon of Excellence in Psychology Award -- 2026" ప్రదానం చేశారు. హర్యానా మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారు ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డును అందజేశారు. సైకాలజీ రంగంలో విశేష సేవలు అందిస్తున్న డా. సాయిప్రియ పేట గారు గత 9 సంవత్సరాలుగా కౌన్సెలింగ్, హిప్నోథెరపీ, వ్యక్తిత్వ వికాసం మరియు మహిళల మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి సమస్యలపై అవగాహన కల్పిస్తూ అనేక మందికి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ గారు, నెరెళ్ల శారద గారు, డా. త్రిపురాన వెంకటరత్నం గారు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న అనంతరం డా. సాయిప్రియ మాట్లాడుతూ, "ఈ గౌరవం నా జీవితంలో మరచిపోలేని గుర్తింపుగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి...

**సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి**




**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మే 11, (చట్టం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకొని గ్రామాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలోని అందే విధంగా చూడాలని చీకటాయపాలెం గ్రామ సర్పంచ్ చిదిరాల కృష్ణమూర్తి అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల గత కొంతకాలంగా పాతబడిపోవడంతో నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా పాఠశాలకు ఇచ్చిన హామీ లో భాగంగా పాఠశాల మొత్తానికి కలర్స్ వేయించడం జరుగుతుందని అన్నారు. అలాగే బడి ఈడు పిల్లలందరినీ డ్రాప్స్ లేకుండా గ్రామంలోని విద్యార్థులందరినీ తీసుకొచ్చి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోడకంటి సరస్వతి శేఖర్, ప్రధానోపాధ్యాయులు కొలుపుల శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సరిత , ఉపాధ్యాయ బృందం కే రాములు, పి వెంకటేశ్వర్లు, బి కృష్ణమూర్తి, ఎస్ రాము, గ్రామ కార్యదర్శి షబ్బీర్ మీయా తదితరులు పాల్గొన్నారు.

## వెల్లటూర్ మండలంలోనీ పైడిపల్లి గ్రామంలోమొదటి ఆయిల్ ఫామ్ గెలకోత కోయడం జరిగింది,



**వెల్గటూర్, మే 11 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో సోమవారం రోజున ఉద్యాన వన విస్తరణ అధికారి వేముల వంశీ కృష్ణ, వెల్గటూర్ మండలం లో పైడిపల్లి గ్రామములో జైన అభినవ్, గంగుల నగేష్, మొదటి ఆయిల్ పామ్ గెల కోత కోయటం జరిగింది 2022-23 సంవత్సరంలో నాటిన వివిధ ఆయిల్ పామ్ తోటలలో సందర్శించదశీ జరిగింది. ఈ సందర్భంగా పైడిపల్లి 2.20 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న జైన అభినవ్, గంగుల నగేష్ తోటలను చూడటం జరిగింది, మళ్ళీ ఇరువై రోజులకి గెలలు కోత కి సిద్ధంగా ఉంటాయని ఇలా నిరంతరం ఆదాయం పొందాలని, రైతు నూతన పంటలకి రైతులు సాగుకి ముందుకి రావాలని ప్రభుత్వం సబ్సిడీలు పొందాలని చెప్పటం జరిగింది వివిధ దశలలో ఉన్న ఆయిల్ పామ్ గెలలను పరిశీలించి వాటికి తగు ఎరువుల యాజమాన్యం పద్దతులను వివరించడం జరిగింది, ఒక్కో ఆయిల్ పామ్ చెట్టుకు దాదాపు10 నుండి 12 గెలలు వేయడం గమనించటం జరిగింది ఇప్పటి వరకు ధర్మపురి డివిజన్ లో మొత్తం రైతులు 10 (16.00)టన్నులు దిగుబడి సాధించారు టన్ను కి ధర 23,500 రేట్ పలకటం జరిగింది ఉద్యాన వన శాఖ అధికారులు చెప్పిన యాజమాన్య పద్దతులను పాటించాలని కోరడం జరిగింది, అదే విధముగా గెలల కోతకు సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు, ఈ కార్యక్రమంలో లోహియా కంపెనీ,క్లస్టర్ మేనేజర్ మహర్షి, ఫీల్డ్ ఆఫీసర్ యోహాను అభ్యుదయ రైతులు పాల్గొనటం జరిగింది.

## ప్రజావాణిలో స్తంభంపెల్లి గంజి వాగు హై లెవెల్ వంతెన గురించి జిల్లా కలెక్టర్ కి వినతి.......



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 11 ,(చట్టం బ్యూరో) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా మే రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభపల్లి గ్రామంలో గంజి వాగు వద్ద ఉన్న హై లెవెల్ వంతె పనులు మధ్యలోనే నిలిపివేసి దాదాపుగా 5నెలలు గడిచినది. వర్షాకాలం సమీపిస్తుండడంతో జూన్ నెలలో వర్షాలు మొదలవడం జరుగుతుంది. కావున చిన్నపాటి వర్షానికి గంజి వాగు ప్రవాహం ఉధృతంగా పెరిగి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. దాదాపుగా రెండు నియోజకవర్గాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయి గ్రామాలలో ఉన్న ప్రజలకు, వ్యవసాయ కూలీలకు, రాజన్న భక్తులకు, ముఖ్యంగా గర్భిణీ, అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి, స్త్రీలకు వృద్ధులకు నిత్యం స్కూలుకు వెళ్లే విద్యార్థులకు వంతెన పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనితో ఒక్కోసారి వారం 10 రోజులు పాటు గ్రామంలోనే ఎటు వెళ్లలేక బందీగా ఉండిపోవడం జరుగుతుంది.కావున దయానియులైన తమరు స్తంభంపల్లి గంజి వాగు వద్ద హైలెవెన్ వంతెన పనులు వెంటనే పూర్తి చేపట్టేలా చొరవ తీసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి రెండు నియోజకవర్గాలు, చొప్పదండి మరియు వేములవాడ ప్రజల కష్టాలను తీర్చాలని మా యొక్క మనవి. ఈ కార్యక్రమంలో దీ=ా సీనియర్ నాయకులు అక్కెనపల్లి కరుణాకర్, వార్డ్ మెంబర్ అక్షనపల్లి మధుకర్, న్యాయవాది అక్కనపెల్లి అజయ్ కుమార్, మరియు ఎర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నియామక పత్రం అందజేత



**కొడిమ్యాల, మే 11(చట్టం) :** స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన జూనియర్ పంచాయతీ కార్యదర్శి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చి ఆదుకోవాలని జగిత్యాల జిల్లా ఆర్టీఐ అధ్యక్షులు అక్కపెల్లి రవీందర్ మార్చి 2026 లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్ కు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి వారికి నియామక పత్రాలను అందజేశారు. మండలంలోని దమ్మయ్యపేట గ్రామ పంచాయతీ జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా కంచర్ల సత్యం నియామకం కాగా..జిల్లా పంచాయతీ అధికారులు ఇచ్చిన నియామక పత్రంను సోమవారం కొడిమ్యాల ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ రాజమణి, సీనియర్ అసిస్టెంట్ సురేష్ కుమార్ లు సత్యంకు అందజేయగా ఆయన విధుల్లో చేరినట్లు తెలిపారు.

# రాజకీయ పార్టీల్లో సర్ భయాలు !

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు,

ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు.

ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్టం చేయగలుగుతాం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్యార్ తరహాలో నంబర్ కేటాయించాలి.

ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయ.

# సువేందు పిఎ హత్య కేసులో పురోగతి

### పోలీసుల అదుపులో బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందిన ముగ్గురు

**కోల్‌కతా,మే11 :పశ్చిమ** బెంగాల్‌లో సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో పురోగతి సాధించారు పోలీసులు. బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం అర్ధరాత్రి వేళ బెంగాల్‌కు తరలించినట్టు సమాచారం. నిందితులలో ఒకరు టోల్ ప్లాజా వద్ద యూపీఐ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు చేయడంతో దర్యాప్తు అధికారులు వారి కదలికలను గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు బిహార్‌లోని బక్సర్‌కు చెందినవారు కాగా, మరొకరు యూపీలోని బల్లియా వాసి. అయితే.. అతను కూడా బక్సర్‌లోనే నివసిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా.. బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ నెల 6న రాత్రి.. సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. కోల్‌కతా నుంచి తన స్కార్పియో వాహనంలో వెళుతున్న చంద్రనాథ్‌ను డోరియా రహదారిపై హత్య చేశారు. ఆయన వాహనాన్ని ఓ కారు అకస్మాత్తుగా ఓవర్ టేక్ చేయగా బైక్‌పై ఉన్న నిందితులు కారు ఎడమవైపు నుంచి వచ్చి నేరుగా చంద్రనాథ్‌పై కాల్పులు జరిపడంతో ఆయన మృతిచెందారు. ఈ ఘటనలో రథ్ డ్రైవర్‌కు కూడా బు÷-లలెట్ తగలడంతో గాయాలయ్యాయి. ఆయన్ను కోల్‌కతా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

# రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్శణకు కృషి

### పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి

### పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమీక్ష

హైదరాబాద్,మే 11 : తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్‌టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు

- **తొలి మూడు ఫలితాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంస**
- **ఒక్కొక్కరికి 5వేల చొప్పన నగదు అందించిన గద్దె దంపతులు**

**విజయవాడ,మే11 :పదో** తరగతిలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులు సత్కరించారు. నలభై మంది విద్యార్థులను సత్కరించి, ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున రెండు లక్షల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు, సంపద యువతే అని కూటమి ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు. మంత్రి లోకేశ్ తన విద్య అనుభవాన్ని ఉపయోగించి 100 రోజుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులతో విజయం సాధించారని కొనియాడారు. రౌడీయిజం, మాఫియా, హింస ఉన్న ప్రాంతాలు, దేశాలు సర్వనాశనం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రప్పా రప్పా అంటూ యువత జీవితాలని నాశనం చేసే పార్టీకి శాశ్వతంగా చరమగీతం పాడాలన్నారు. అటువంటి వాతావరణానికి దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని గమనించిన ప్రజలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీని అందించారన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం అనేది కేవలం వ్యక్తి కోసం కాదని.. అది రాబోయే తరాల పిల్లల భవిష్యత్తు కోసమని అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు.

యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. అమరావతి నగరం ఆంధ్ర రాష్ట్రం మొత్తానికి ఉపాధి కల్పించే నగరంగా మారబోతోందన్నారు. కూటమి ప్రభుత్వం తన అజెండాలో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇప్పటికే అనేకమందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. రాజకీయ సిఫార్సులు, లంచాలకు తావులేకుండా, ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగానే టీచర్లను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. బదిలీల విషయంలో కూడా ఇదే విధమైన పారదర్శక విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువును ఎక్కడా ఆపవద్దని... ఫీజుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడించారు. మరి కొంతమందికి స్ఫూర్తిని కలిగిస్తూ దాదాపుగా 40 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సత్కారం చేశారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన ప్రతి ఒక్కరితో పాటు, ఉపాధ్యాయుల ను సన్మానించారన్నారు. విద్యకు ఉన్న ప్రాధాన్యం సీఎంకు తెలుసు కాబట్టే డీఎస్సీలో మొట్టమొదటగా 16 వేల మంది టీచర్లను అపాయింట్ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం డీఎస్సీ మీదనే చేశారన్నారు. విద్యలో ఎన్నో సంస్కరణలను మంత్రి లోకేశ్ తీసుకొచ్చారన్నారు. 100 రోజుల ప్రణాళికను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులందరినీ ఆ ఎ÷-లాన్‌లోకి తీసుకువెళ్లి మంచి ఉత్తీర్ణత సాధించారని కొనియాడారు. నేడు ప్రభుత్వ బడుల నుంచి వచ్చిన పిల్లలను పేపర్‌లో చూడటం పట్ల రాష్ట్ర ప్రజలందరూ

ఆనందం వ్యక్తం చేస్తున్నారని అనురాధ అన్నారు. మరికొంత మంది విద్యార్థులకు, ఎంతో మంది తల్లిదండ్రులకు స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం ఇది అని చెప్పుకొచ్చారు. సమిష్టి కృషి, చంద్రబాబు ముందడుగు, లోకేశ్ సంస్కరణలు, ఉపాధ్యాయులు దాన్ని అనుసరించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

-------

# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

- **పోలవరం పెండింగ్ అంశాలను పరిష్కరించండి**
- **తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి**
- **కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు**

**న్యూఢిల్లీ,మే11 :** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్ లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించు కోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సించాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎఎఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# సర్ ప్రక్రియపై సిఇవో సమీక్ష

### పకడ్బందీ మ్యాపింగ్ చేపట్టాలని ఆదేశం

**హైదరాబాద్,మే** 11 : భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు , ఎన్నికల నమోదు అధికారులు తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ పక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరు వరకు 90 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్లు, అధికారులను ఆయన ఆదేశించారు. మ్యాపింగ్ కార్యక్రమానికి సహకరించేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు , గేటెడ్ కమ్యూనిటీలను కలుపుకోవాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులందరూ సంబంధిత బిఎల్‌వోలసంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని సీఈఓ కోరారు. గేటెడ్ కమ్యూనిటీలు, స్లమ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడి ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మ్యాపింగ్ పక్రియను చేపట్టాలని ఆయన సూచించారు. ఓటర్లకు మ్యాపింగ్‌లో సహాయం అందించేందుకు సూపర్వైజర్ స్థాయి అధికారులు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా, స్వయం సహాయక సంఘాలు, రేషన్ షాప్ డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా ఈ మ్యాపింగ్ పక్రియలో భాగస్వామ్యం చేయాలని కోరారు. మరణించిన, వలస వెళ్లిన, శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, విధి విధానాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే తమ నియోజకవర్గాలలోని ÷ఎఎఖ, ÷ఎఎఖ ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా చేపట్టాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించేలా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. అనధికార వ్యక్తులతో ఎటువంటి సమాచారం పంచుకోవద్దని సీఈఓ హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లను లేదా ఓటర్లను గుర్తించడంలో మాత్రమే బిఎల్‌వోల సహాయం తీసుకోవాలని ఆయన చెప్పారు. తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని తక్షణమే సరిచేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో ముద్రిత, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్లను కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, సాంకేతిక సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కోహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు

### డిసెంబర్ 9 నుంచి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు - మంత్రి తుమ్మల

**హైదరాబాద్,మే** 11 : రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించే దిశగా కీలకంగా భావిస్తున్న కొహెడ సమగ్ర మార్కెట్ నిర్మాణ పనులు తుది దశలోకి చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొహెడ సమగ్ర మార్కెట్‌కు సంబంధించిన సవరించిన లేఅవుట్‌పై మార్కెటింగ్ అధికారులతో ఈ రోజు సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల... రైతులు, వ్యాపారులు మరియు ఇతర భాగస్వాముల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు రూపకల్పనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును 3 దశలలో పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. తొలి దశ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 9న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌లో కొనసాగుతున్న లావాదేవీలను కొహెడ సమగ్ర మార్కెట్‌కు సాఫీగా తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమన్వయంతో తరలింపు పక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9 నుంచే కొహెడ మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొహెడ సమగ్ర మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపెన్ ఎ÷-లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, డ్రైయింగ్ యార్డులు, విశాల రహదారులు, రవాణా సౌకర్యాలు, పారదర్శక లావాదేవీల కోసం సాంకేతిక వసతులు, రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సమగ్ర మార్కెట్ ద్వారా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు, మధ్యవర్తుల ప్రభావం తగ్గి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో కొహెడ సమగ్ర మార్కెట్ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

÷రిత్తం ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన తుది ప్రతిపాదనను గౌరవ ముఖ్యమంత్రికి ఆమోదం కోసం సమర్పిస్తున్నామని వెల్లడించారు

# అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

### పిడుగులతో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ

అమరావతి,మే 11(ఆర్ఎన్ఎ): అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తర శ్రీలంక తీరానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు, రైతులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రకారం ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా తీరప్రాంత జిల్లాలతో పాటు రాయలసీమలో కూడా వాతావరణ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిడుగుల సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని హెచ్చరించారు. ఉరుముల శబ్దాలు వినిపించిన వెంటనే సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. అలాగే పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడకూడదని అధికారులు హెచ్చరించారు. చెట్ల కింద ఆశ్రయం పొందడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనిచేస్తున్న సమయంలో ఉరుముల శబ్దాలు వినిపిస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.వర్ష సూచనలతో పాటు కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతు న్నాయని వెల్లడించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం ప్రాంతాల్లో వడగాలుల హెచ్చరిక జారీ చేశారు. జికే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, చింతూరు, కూనవరం మండలాల్లో హీట్ అలర్ట్ అమల్లో ఉందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయవాడ తూర్పులో అత్యధికంగా 42.3÷బిఅ నమోదు, కుక్కునూరు, కూనవరం ల 42.1÷బిఅ, మంత్రాలయంలో 41.5÷బిఅ, కొప్పెరపాడులో 41.4÷బిఅ, కడపలో 41.3÷బిఅ, తాడేపల్లిలో 41.2÷బిఅ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాలులు, పిడుగుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పశువులను చెట్ల కింద కట్టేయకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం సమయంలో చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. తగినంత నీరు తాగడం, ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా ఉండడం అవసరమని తెలిపారు.

# జెసిబి యూనియన్ పై వల్గర్ మాటలు మాట్లాడిన పాకాల నరేష్

### 8000 కాదు కదా 800 కూడా కట్టను ఏం పీక్కుంటారో పీక్కోండి



**వెల్గటూర్, మే 11 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం వెల్గటూర్ యూనియన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం!యూనియన్ లో చేరమనడంలో తప్పేముంది? జేసీబీ యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు ఖండన వెల్గటూర్ మండల జేసీబీ యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని యూనియన్ సభ్యులు హెచ్చరించారు యూనియన్ సభ్యులతో కలిసి ఖండించారు. తాము ఎవరినీ బలవంతంగా డబ్బులు కట్టమని ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని అడగడంలో తప్పేముందని ప్రశ్నించారు. అప్పులు చేసి జేసీబీలు కొనుగోలు చేసి, ప్రతినెల ఫైనాన్స్‌లు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. జేసీబీ యూనియన్‌ను 2024లో రిజిస్ట్రేషన్ చేశామని, ప్రస్తుతం యూనియన్‌లో రూ.5.40 లక్షల నిధులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. సభ్యుల నిర్ణయాల ప్రకారమే కొన్ని నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా జేసీబీలు కొనుగోలు చేసిన వారిని యూనియన్‌లో చేరాలని కోరుతున్నామని, ఇదే క్రమంలో స్థంభంపెల్లి గ్రామానికి చెందిన పాకల నరేష్‌ను కూడా సభ్యత్వం తీసుకోవాలని అడిగినట్లు వివరించారు. యూనియన్ నిధుల ప్రకారం సభ్యత్వం రూ.35000/- చెల్లించాల్సి ఉంటుందనీ, ప్రస్తుతం అయితే రూ.8000 చెల్లించి సభ్యత్వం పొందాలనీ కోరము అందుకు అతను 8000వేలు కాదు 800 వందలు కూడా కట్ట అని యూనియన్ సభ్యులకు మీరు ఎం చేసుకుంటారో చేసుకోండి అని అతనే హుకుం జారిచేసాడు అని యూనియన్ సభ్యులు వివరించారు.సభ్యత్వం గురించి మాత్రమే చెప్పామని, కానీ ఎప్పుడూ డబ్బులు చెల్లించాలనీ ఒత్తిడి చేయలేదన్నారు. పాకల నరేష్ సభ్యత్వం తీసుకోక పోగా, తమ యూనియన్ పైనే నిందలు వేస్తూ, ఒక్క రూపాయి కూడా కట్టననీ, ఏం చేసుకుంటారో చేసుకొమ్మనీ యూనియన్ సభ్యులపైనే దురుసు ప్రవర్తన చేసినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘన అంశంపై మండల తహసీల్దార్‌ను కూడా కలిసి వివరించినట్లు తెలిపారు. పాకల నరేష్ యూనియన్‌లో చేరకుండా, ఇప్పుడు తానే యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని యూనియన్ సభ్యులు ఆరోపించారు.

# జనగణన కార్యకలాపాలకు కంప్యూటర్, ప్రింటర్ల అందజేత




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/మే 11 ,(చట్టం బ్యూరో) :** జనగణన -- 2027 భాగంగా కార్యకలాపాలను అంతరాయం కలగకుండా నిర్వహించేందుకు జనగణన ఛార్జ్ అధికారులకు కంప్యూటర్, ప్రింటర్లను జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని మండలాల ఛార్జ్ అధికారులకు అందజేశామని తెలిపారు.

జనగణన ప్రక్రియను సమగ్రంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు,

సమాచార సేకరణ, నివేదికల తయారీ వేగవంతంగా చేసేందుకు కంప్యూటర్లు, ప్రింటర్లు ఉపయోగపడతాయని అన్నారు. అధికారులకు అందజేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించి, క్షేత్ర స్థాయిలో సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి, ఎస్ ఓ సంపత్, ఛార్జ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి







- **రాబోయే 15 రోజుల్లో 90% మ్యాపింగ్ పూర్తి చేయాలి**
- **ఏ నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**
- **అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**
- **హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 11 ,(చట్టం బ్యూరో) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు.

జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల బాధను పట్టించుకోని ప్రభుత్వం

### మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి ; మే 11 (చట్టం ప్రతినిధి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెల రోజులు గడుస్తున్న కాంట వేయకుండా రైతులను అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి అన్నారు . పట్టణ కేంద్రంలోని రేవనపల్లి , మండల పరిధిలోని భీమనపల్లి , గౌస్కొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు . ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు . తూకం పేరుతో 42 కిలోల ధాన్యం కాంట వేస్తూ రైతుల కష్టాలని మిల్లర్రు దోచుకుంటున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు . సివిల్ సప్లై అధికారులు ఇప్పటివరకు సమస్యలపై పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు . రైతుల సమస్యలను పరిష్కరించి కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు . కార్యక్రమంలో మాదుగుల ప్రభాకర్ రెడ్డి , పాటి సుధాకర్ రెడ్డి , కందాడి భూపాల్ రెడ్డి , పాక వెంకటేష్ , బత్తుల శ్రీశైలం , నోముల మాధవరెడ్డి పాల్గొన్నారు .

# ప్రత్యేక దర్శనం కల్పించాలి

### దీక్షాస్వాముల వేడుకోలు



**కొడిమ్యాల, మే 11(చట్టం) :** హనుమాన్ దీక్షా స్వాములకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక దర్శనం కల్పించాలని ఆలయ అధికారులను దీక్షాస్వాములు వేడుకొంటున్నారు. జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలకు తెలంగాణలోని పలు జిల్లాల నుండి హనుమాన్ దీక్షా స్వాములతో పాటు సాధారణ భక్తజనులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. కొన్ని ఇతర జిల్లాల నుండి కూడా వందల కిలోమీటర్లు కాలినడకన ఎండలో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ అంజన్న సన్నిధికి చేరుకోవడం జరుగుతుందని, కనుక దీక్షాస్వాములకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించాలని సోషల్ మీడియాలో వీడియో ద్వారా అధికారులను వేడుకొంటున్నారు.

# బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్‌ని వెంటనే అరెస్టు చేయాలి.

### బాధ్యత వహించి బండి సంజయ్ రాజీనామా చేయాలి.




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 11 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాల మేరకు మరియు చీూఖ× నేషనల్ కోఆర్డినేటర్ మన్నే జీవన్ వారి ఆదేశాల ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించబడింది. మైనర్ బాలికపై జరిగిన ఘటనలో బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని, బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని మరియు బండి సంజయ్ తన మంత్రి పదవి నుండి రాజీనామా చేయాలి అని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పోలీసులు అడ్డుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా NSUI నాయకులు మాట్లాడుతూ, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం మరియు పోలీసులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు ఎన్ఎస్‌యూఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దిష్టిబొమ్మ దహనం చేపట్టిన సమయంలో పోలీసులు కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగగా, అనంతరం పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకొచ్చారు.

అలాగే నిందితులను కాపాడే ప్రయత్నాలు మానుకుని, చట్టం ముందు అందరూ సమానమే అన్న విషయాన్ని ప్రభుత్వం నిరూపించాలని డిమాండ్ చేశారు.

ఈ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల సుమంత్, జిల్లా చీూఖ× నాయకులు పల్లె వెంకటరమణ రెడ్డి, బసవేని తేజస్, పెద్దపల్లి గోపాలకృష్ణ , ఉమ్మేతల ఆశిష్ రెడ్డి, ఇతర చీూఖ× నాయకులు, గొట్టే బాబు పాల్గొన్నారు.

# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

- **వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష**
- **కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**
- **విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షస్తున్నా**
- **'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు**
- **ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,మే 11 :** ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు.



## చట్టం సాహితీ లోకం
95814 19999

### నిరీక్షణ



నీ దుఃఖం మాటలకి
ఆ రాత్రి రాలిన కన్నీటిచుక్కలు
ఎన్నో!లెక్కించలేకపోయా......

ఆ క్షణం
నీ కనురెప్పల దొంతరలనుండి
జారిన ఉప్పునీటి చుక్కలని
ప్రతి క్షణం మదిలో పేర్చుకుంటున్నా..

ఆ క్షణం నీ మనసు నుండి
వచ్చిన మాటలకు సంభ్రపడ్డ
క్షణాలను ఏరుకుంటున్న..
నేటికీ.....

నా ఏకాంతంలో
నిన్ను గుర్తు చేసే ఆలోచనల
క్షణాలను ప్రతి నిమిషం
లెక్కించుకుంటున్నా..

ఒంటరిగా పవలించి
ఎంతకాలం పరిచయం మాటలకి
నిర్ఘంతపోయిన క్షణాలను
నేటికీ లెక్కించుకుంటున్న..

ఈ నాటికి అస్థిత్వ
ప్రశ్నలు వేసుకుంటు
ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా
క్షణాలను లెక్కించుకుంటున్న..

లేకుండా ఉండలేను
నాటి మాటలు నీటి మూటలుగ
తలచి,
రోజులు లెక్కించుకుంటున్నా..

నాడు ఒక క్షణం నీదై
ఆగిన తియ్యని భావాల
చేదు క్షణాలను తలుసుకుంటూ
నిరీక్షిస్తున్నాను...

// గురువు //
కార్తీక్ దుబ్బాక.
విజయవాడ..

చట్టం సాహితీ లోకం
95814 19999



### కళ్ళు తెరవండి..! కంప్యూటర్ యుగంలోనైనా..!!

ఓ బహుజన బిడ్డలారా..!
కళ్ళు తెరవండి...
కాలాన్ని చదవండి..
కంప్యూటర్ కిరణాల్లో
కత్తిలా పదునెక్కండి...
జ్ఞాన ఖడ్గం ధరించండి...
చైతన్య చక్రం తిప్పండి...
ఓటనే వజ్రాయుధంతో అధికార
ద్వారాలను బ్రద్దలు కొట్టండి..!

ఓ బహుజన బిడ్డలారా..!
ఇంకెంతకాలం...?
వెర్రి గొర్రెల మందల్లా
వెనకే నడుస్తారు...?
ఇంకెంతకాలం...?
గబ్బిలాల్లా
అజ్ఞానాంధకార గుహల్లో
తలక్రిందులుగా వ్రేలాడుతారు...?

ఇంకెంతకాలం...?
పొలాల్లో పశువుల్లా
పగలూ... రేయీ...
ప్రాణాలు ఫణంగా పెట్టి
పరుల పంటలు పండిస్తారు...?

ఓ బహుజన బిడ్డలారా..!
ఇంకెంతకాలం...?
వారికి ఎండలో గొడుగులౌతారు...
వారి అడుగులకు మడుగులౌతారు...
వారి ఇళ్లకు కాపలా కుక్కలౌతారు...
వారి కాళ్లకింద నలిగే పూలరేకులౌతారు?

చాలు..! ఇక చాలించండి..!
మీకు మంచి రోజులొచ్చాయని
గ్రహించండి...వెలుగు శిలలపై
చైతన్య గీతాలతో
కొత్త చరిత్రలను చెక్కండి..!

బానిస సంకెళ్లను
బ్రద్దలు కొట్టండి...
భయపు బావుల్లోనుంచి
వాయువుల్లా ఎగసిపడండి..!

ఓ బహుజన బిడ్డలారా..!
మీ రక్తంలో నిప్పు రవ్వలు కాదు...
రగిలే అగ్ని పర్వతాలున్నాయని
ప్రపంచానికి చాటి చెప్పండి..!

మీ పిడికిలి
మాంసపు ముద్ద కాదు...
మార్పును మ్రోగించే
మహా మృదంగమని చూపండి..!

మీ ఓటు
కాగితం కాదు...
అది కాలాన్ని కదిలించే
కరవాలమని గుర్తించండి..!

ఐక్యతే ఆయుధమని...
ఆత్మగౌరవమే ఆభరణమని...
రాజ్యాధికారమే మీ
తరతరాల తలరాతను మార్చే
రామబాణమని నమ్మండి..!

ఓ బహుజన బిడ్డలారా..!
అదిగో...! దక్షిణ దిక్కున
విజయ విహంగం రెక్కలు విప్పింది...
రెండేళ్ల రాజకీయ రణంలోనే
ప్రజా ప్రభంజనమై పైకెగిసింది...!

"విజయ్" అనే నేను అంటూ
నేడు తమిళనాడు
ముఖ్యమంత్రిగా
ప్రమాణ స్వీకారం చేస్తున్న
వెలుగు వీరున్ని చూసి...
మీరంతా విజయ పథంలో
విప్లవ శంఖారావం పూరించండి..!

బానిసలుగా కాదు...బహుజన
బాహు బలులుగా బ్రతకండి...
అనుచరుల్లా కాదు...పాలకులుగా
అధికార అశ్వాలపై అధిరోహించండి...
పిడికిలి బిగించండి...
ఆత్మ గౌరవపోరాటం ప్రారంభించండి..!

రక్తాన్ని రగిలించండి...
రాజ్యాలను గెలుచుకోండి...
కళ్ళు తెరవండి..! ఇకనైనా
ఈ కంప్యూటర్ యుగంలోనైనా
రాయండి చరిత్రను తిరగ రాయండి..!
విజేతలు కండి..!
విశ్వ విజేతలుగా ఎదగండి..!

రచన: కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
--



చట్టం సాహితీ లోకం
95814 19999

### నాటి ఆటవికత..నేటి నవ నాగరికత



నాటి ఆటవికత..నేటి నవ నాగరికత
నిన్నటి రాక్షసత్వం..నేటి రాజకీయం.

నాడు..ఆది మానవుడు
బట్ట కట్ట లేదు..
పచ్చి మాసం తినే బతికాడు
' బల వంతునిదే రాజ్యం ' అయింది.

క్రమేణా.. ఆకులు అలములు
బట్టలైనాయి.అర్ధ నగ్నతే..
నాటి జీవన విధానమైంది.
రాక్షస వివాహం ఆచారమైంది.

రాను రాను..బల వంతుడు
'భగవంతుడు ' ఐయ్యాడు.
రాజై రాజ్యాలేలాడు..
అందమైన అతివల్ని చెరపట్టి , చెరిచాడు.

అక్షరాలు నేర్చి..ఆధునికుడు అయ్యాడు
బట్టలు నేసి , కట్టి నవ నాగరికుడై
విజ్ఞాన సంపన్నుడయ్యాడు.
పంచ భూతాలను జయించాడు.
నాగరికత ముదిరి..అర కొర బట్ట కట్టి
ఇదే..' మోడ్రన్ కల్చర్ ' అన్నారు.
కట్టు బట్ట..తిండి తిప్పలు
తిరుగు ముఖం పట్టాయి.

నేడు..వేసిందే బట్ట..తిన్నదే తిండి
పాశ్చాత్య సంస్కృతి రాజ్యం ఏలుతోంది.
నవ నాగరికుడు..ఆనాటి
ఆటవికుడై..మిగిలాడు. జీవిస్తున్నాడు.

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

చట్టం సాహితీ లోకం
95814 19999

### జీవితమే ఆశాశ్వతం



మనిషి అశాశ్వతం
మనిషి జీవితం అశాశ్వతం
ఏదీ శాశ్వతం కాదు
అన్నీ తాత్కాలికమే!
ఇనుమును ఎవ్వరూ
నాశనం చేయలేరు
ఇనుముకు పట్టిన తుప్పే
దాన్ని నాశనం చేస్తుంది
అలాగే మనిషిని కూడా
ఎవ్వరూ నాశనం చేయలేరు
మనిషికి ఉండేటటువంటి
పాడు ఆలోచనలు
చెడ్డ ఉద్దేశ్యాలు
మనిషిని సర్వనాశనం చేస్తాయి
ఒకరికి అన్యాయం చేసి
బ్రతికే బ్రతుకు
ఇప్పుడు సుఖంగా ఉండొచ్చు
కానీ... కాలం అనేది ఎప్పుడూ
ఒకేలా ఉండదని గుర్తించుకో!
ఎంతటి వారైనా సరే
ఎప్పటికైనా అంతకు మించి
కర్మ అనుభవించక తప్పదు
అన్యాయానికి తాత్కాలిక గెలుపు
న్యాయానికి మాత్రం
నిదానంగా గెలుపు దక్కుతుంది.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

చట్టం సాహితీ లోకం
95814 19999

### జీవితం అడిగే ప్రశ్న



ఎవరికోసమైతే
మనసంతా ముక్కలయ్యేలా ఆలోచిస్తావో
ఎందుకోసమైతే
ప్రాణం చెమటై నేలకారేలా కష్టపడుతావో
చివరికి తెలిసేది ఒక్కటే
నీ ప్రయాణం నీదే
నీ చివరి అడుగులో
ఎవరి నీడా నీతో నడవదు.

దాచుకున్న ధనం,
కట్టుకున్న మేడలు,
గర్వంగా చూపించే హోదాలు
ఒక్క గాలివాన చాలు
కాలం అనే అల
అన్నిటినీ ఇసుకరేణువులా చెదరగొడుతుంది

ఇక్కడ శాశ్వతం అనుకున్న ప్రతి దానికీ
ఒక క్షణమే సరిపోతుంది ముగింపుకి.
అందుకే జీవితం
గడియారం ముల్లుల మీద వేలాడే
ఒక నీటి బిందువులాంటిది.

దేవుడు అడిగేది
నీ బ్యాంకు లెక్కలు కాదు
నీ భవనాల ఎత్తు కాదు
ఎంత సంపాదించావన్నది కాదు

"నీకు ఇచ్చిన ఈ అమూల్యమైన జీవితం
ఎంత ప్రేమగా జీవించావు?"
అదే ఆయన ప్రశ్న

నవ్వాల్సిన రోజుల్లో
బాధలతో కాలం కాల్చుకున్నావా?
ఆస్వాదించాల్సిన క్షణాలను
ఆస్తుల వెంబడి పాతిపెట్టేశావా?
అని మనసునే నిలబెట్టి అడుగుతాడు

అందుకే
కొంచెం సమయం
నీ కోసమూ ఉంచుకో
మనసుకు నచ్చిన వెలుగులో
జీవితాన్ని ఒకసారి హత్తుకో

ఎందుకంటే
ఒంటరిగానే వచ్చాము
ఒంటరిగానే వెళ్లిపోతాము
మన వెంట నడిచేది
మనిషి కాదు, సంపద కాదు

మన వెంట వచ్చేది
మనం నడిచిన ధర్మం
మనం చేసిన కర్మం మాత్రమే!

రామడుగు వేణుగోపాల్
దోహా, ఖతార్
(మంథని)

చట్టం సాహితీ లోకం
95814 19999

### ప్రతిభతో విజయ కేతనం



సగటు మానవుడు విద్యతో విజ్ఞాన
సుగంధాలు విరజిమ్మాలి
విద్యతో వినయం ఆభరణం గా ధరించాలి
అజ్ఞానపు చీకట్లను పారద్రోలాలి
మారుమూల గ్రామాల్లో... సగటు రైతు
తన నిషానీ ముద్రతో మోసపోతూనే ఉన్నాడు
పంటను కొనుగోలు చేసే చోట
దళారీల చేతుల్లో వంచనకు గురవుతూనే
ఉన్నాడు
విద్యను ఆస్వాదనకు వయసు అడ్డురాదు...
బంధాల చిక్కుముడులు...
సమస్యల వలయంలో సగటు జీవి
విద్య లేక దోపిడీకి గురవుతున్నాడు
ఏవీ నాటి ప్రాచీన విజ్ఞాన సంపదలు
అటు వ్యవసాయం... ఇటు ఖగోళ శాస్త్రం
ఆపై రసాయన శాస్త్రం... గణిత శాస్త్రం
ప్రపంచానికి అందించిన ఘనత అఖండ
భారతావనికే చెందింది... గ్రామ గ్రామాన
ప్రతీ లోగిలి అక్షర సేద్యానికి శ్రీకారం
చుట్టాలి
మనసుంటే మార్గం చూపెడుతుంది
మకిలి పట్టిన మనసులు.. విజ్ఞాన వెలుగులు
ప్రసరించాలి
ప్రతీ మడిలో... బడిలో...
అమ్మ ఒడి భాషను వయోజనులు
ఔపోసన పట్టాలి
నూరు శాతం అక్షరాస్యతే మన లక్ష్యం
అక్షరమే సరస్వతీ కటాక్షం
అక్షరమే మన ఆయుధం విజ్ఞాన సంపదే
లక్ష్మీ నివాసం
నవీన భారతావనిలో ప్రతిభా పాటవాలతో
విజయ కేతనం ఎగురవేయాలి

కొత్తపల్లి కృష్ణారావు
ఫార్మసీ ఆఫీసర్
ఖమ్మం
8897467671

చట్టం సాహితీ లోకం
95814 19999

### సాహసాల వీరుడు విజయ్



.....................................
తెలుగు గడ్డపై జన్మించి
తమిళ గడ్డపై కాలీడి

సినీ ఫీల్డుసిరుల్కురిపించి న
గొప్ప నటుడు విజయ్ తంబి

మేధావులు కే మేధావి
సకల గుణ సంపన్నులు

కోట్లాది ప్రజల ఆశాజ్యోతి
మానవత్వం ఉన్నమనిషి

పుట్టింది తెలుగు గడ్డపైనే కానీ
పెరిగింది తమిళ నేలపై

బానిసలుగా బ్రతకకండి
ఉన్నత చదువులు చదవండి

కులసంస్కృతి పోవాలంటారు
మత ఘర్షణలు వద్దంటారు

సర్వ మానవ సమానత్వం
కావాలంటారు జోషబ్ తంబి

తమిళ రాజకీయాలలో
పెను మార్పులు తెచ్చి

తమిళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా
ఎన్నిక కాబడిన వ్యక్తి తంబి

ఎన్నోకుతంత్రా లు ఎదుర్కొని
సింహాసనాన్ని అధిష్టించారు

ముఖ్యమంత్రి కాదు ముఖ్యం
అవినీతిని రూపుమాపుదాం

ప్రజా సంక్షేమం ముఖ్యం
రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం

మతతత్వ,, కులతత్వ
పార్టీలతో పొత్తు వద్దంటారు

ప్రజలే నా దేవుళ్ళు
ప్రజా సంక్షేమము నా వీధి

అంటారువిజయ్ జోసెఫ్
.....................................

రచన సాపాటి ప్రభాకర్
బ్రాహ్మణ కోడూరు గ్రామం
సాహితీ రత్న నంది తెలుగు తేజం
అవార్డుల గ్రహీత

చట్టం సాహితీ లోకం
95814 19999

### రాజకీయ చదరంగం ...రాచరిక భావ జాలం



అదొక పద్మవ్యూహం దూరినాకా అలవాటు
ఉన్న లేకున్నా చిక్కుముడుళ్ళు తీర్చితే
తరగిపోని పేచీలు ఎత్తులు చిత్తులు
అలవికాని అడ్డంకులు ఒడిదుడుకులు
ఎన్నెనో మలుపులు కుదుపులు

ఎక్కే నిచ్చెనలు మింగే పాములు ఎన్నో అన్నీ
భరించాలి
లోలోన జరిగే కుమ్ములాటలు అందమైన
దోబూచూ లాటలు

కనబడని సుకూరమైనా వెన్నుపోటులు
అవసరాల కోసం జరిగే బేరసారాలు
పొత్తులు ఎన్నో
అవకాశాల కోసం అందరినీ నమ్మాలి
నమ్మినట్టు నటించాలి

పదవుల కోసం భజన కీర్తనలు కుదరకపోతే
బేషాజారు మామూలే
పోవడం అవకాశాల కోసం కసపు కాయడం
కాకపోతే కిరికిరి చేయడం

అది ఓ అద్భుత కల అందులోకి రావడం
ఓ అంతులేని కళ

ఇచ్చే తీర్పు ఒకటైతే పీఠానికి చేరడం ఓ
నేర్పు
అనుకూలం అయితే చట్టబద్ధత
లేకుంటే అన్ని ఉన్న మెలికల చట్ట విరుద్ధం

రాసుకున్న మహా రాజ్యాంగం ఘనం
గణతంత్ర ప్రజాస్వామ్య సూత్రాలు
అమూల్యమైనవే
ఆచరణలోకి వస్తే అఖండం ప్రజాస్వామ్య
వ్యవస్థలో రాజకీయ చదరంగం, రాచరిక
భావజాలం పెరిగితే కష్ట నష్టాల సాగరమే

రచన....సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్
చురకశ్రీ కావలి నెల్లూరు జిల్లా.

# చట్టం సాహితీ లోకం

95814 19999

## మూగ బ్రతుకులు:



విషములుండు
బావులు
మానవ దేహంబులు,
ఏ స్వార్థం లేని
నిస్వార్థ
జీవంబులు
"వన్యప్రాణులు "
కత్తులుండు గదులు
మానవ హృదయంబులు
"నమ్మకములే"
ఆయుధంగా
జీవించేడి
"వన్యప్రాణులు "
క్రోధములుండు
గదులు
" మానవ గృహంబులు "
"నిస్వార్థా ఆవాసాలు
వన్యప్రాణి నివాసములు"
" ప్రేమాలెక్కడ
ఈ మానవ జన్మలో ?
అంతా నటనే
ఈ పుడమిలో...!
ఇదొక
అమర్యాద కాబోలు...
ఈ లోక పోకడ...!
"ఈ మానవ జన్మకు"
" మాటలు రాని
మూగసైగలతో
గుట్టుగా
సంసారం
నెట్టకొస్తున్న
మూగజీవాలు "
మాటలే విషమై
సంసారాలు
కూల్చుకుంటున్న
"మానవ ప్రపంచం "
అవసరాలకు
మాటలు పేర్చిన
మానవ ప్రపంచం,
పొగడ్తలతో
పాడౌవుతున్న
సభ్య సమాజం,
"స్వాడబ్బా పరడబ్బా
పరంపర డబ్బాలతో
పబ్బం గడుపుకుంటున్న
మానవ సమాజం "
మాటలు రాని
ప్రాణులు
నేరములు చెయ్యని
ప్రాణులు
"వన్యప్రాణులు "
నేరములు క్రోధములు
ప్రాణంబులుగా
"మానవ బ్రతుకులు "
వన్య ప్రాణులు
బ్రతుకులే
మానవజన్మలకు
మార్గదర్శకాలు
వన్య ప్రాణులే
ఆప్యాయతకు
"అమ్మలు"
బాధ్యతకు
"నాన్నలు"
" మూగజీవాలే
మానవ జన్మకు
ఉపాధ్యాయులు "
జంగల్ చట్టం
మానవ జన్మకు
చుట్టం వంటిది,
"వన్య ప్రాణులను
రక్షిద్దాం.....
మానవ విలువలు
నేర్చుకుందాం"!
జైహింద్..

డాక్టర్,కందులసుధాకర్
తెలంగాణ కేసరి,
సోషల్ రిఫార్మర్,
సేవారత్న,
స్వర్ణ నంది
అవార్డు గ్రహీత,
మానవ విలువల
సందేశకుడు,
ఖమ్మం జిల్లా,
9390708322.

చట్టం సాహితీ లోకం
95814 19999

## గౌరవ కుటుంబికులారా!

కుటుంబం అంటే---
కేవలం నాలుగు గోడల మధ్య జీవనం కాదని తెలుసుకోండి,
నాలుగు హృదయాలు
ఒకే స్పందనగా కొట్టుకునే స్నేహసౌధంగా భావించండి॥



ఒకటిగా ఉండండి---
వాన గాలులెన్ని విరుచుకుపడ్డా
వేర్లు విడనాడని వృక్షంలా నిలబడండి,
విపత్తులు ఎన్ని ఎదురైనా
విడిపోని వెలుగులా నిలవండి॥

ఒకేతాటిపై నడవండి---
అడుగులు వేరైనా
ఆశయాలు ఒక్కటై సాగండి,
మాటలు భిన్నమైనా
మనసులు కలిసే మార్గమై ఉండండి॥

ఒకేమాటపై నిలబడండి---
నమ్మకం అనే నిటారుదీపాన్ని ఎప్పటికీ ఆరనీయకండి,
అపార్థాల మబ్బులొచ్చినా
ఆప్యాయతను సూర్యునిలా వెలిగించండి॥

"మేము అంతా ఒకటే" అని చాటండి---
అన్నదమ్ముల అనుబంధంలో,
అక్కచెల్లెళ్ల ఆప్యాయతలో,
తల్లిదండ్రుల త్యాగాల్లో ప్రేమ పరిమళం పంచండి॥

ఒకరికొకరమని నిరూపించండి---
కష్టాల్లో చేయూతగా నిలబడి,
కన్నీళ్లలో ఓదార్పుగా మారి,
సంతోషాల్లో నవ్వుల హారతిగా సహచరులై సాగండి॥

ఒకటే ఆశయం పెట్టుకోండి---
"మన కుటుంబ సంతోషమే మా సంపద"
అనే మహామంత్రం జపించండి,
అనురాగాల అమృతవర్షం కురిపించండి॥

కుటుంబం కలిసుంటే---
చిన్న ఇల్లు కూడా స్వర్గమవుతుందని చెప్పండి,
మనసులు కలిసుంటే---
చిన్న జీవితం కూడా మహాకావ్యమవుతుందని తెలపండి॥

కుటుంబాన్ని---
గౌరవంగా గుండెల్లో నిలుపుకోండి,
అనురాగంగా ఆత్మీయత పంచుకోండి,
ఆనందనిలయంగా వెలిగే అమృతబంధమని గుర్తించండి॥

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.






# 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. దీంతో 'కల్కి 2'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లే జరిగితే 2027 డిసెంబర్‌లో 'కల్కి 2' ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# విశ్వంభర మూవీపై భారీ అంచనాలు

### రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.




# విజయ్‌పై ప్రియాంక వ్యాఖ్యలు వైరల్



గ్లోబల్ స్టార్‌గా ఓ వెలుగు వెలుగుతున్న ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం ప్రస్తుత తమిళ సిఎం, హీరో విజయ్‌తో మొదలైంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఆయన గురించి గతంలో ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. 2002లో విడుదలైన తమిజన్ సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో విజయ్ హీరోగా నటించగా, ప్రియాంక హీరోయిన్‌గా కనిపించారు. అప్పట్లో కొత్తగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియాంకకు తమిళ భాష కూడా తెలియదట. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నాకు అప్పట్లో తమిళం అస్సలు రాదు. డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టి చెప్పేదాన్ని. సినిమాల షూటింగ్ ఎలా జరుగుతుంది? సెట్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై కూడా పెద్దగా అవగాహన లేదు. థియేటర్‌లో సినిమాలు చూడడమే నాకు తెలిసిన అనుభవం అంటూ గుర్తుచేసుకున్నారు. అయితే 'తమిళన్' షూటింగ్ సమయంలో విజయ్‌కు ఉన్న అభిమాన గణాన్ని చూసి తాను పూర్తిగా ఆశ్చర్యపోయానని ప్రియాంక తెలిపారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వందలాది అభిమానులు వచ్చేవారని, సెట్స్‌లోకి రావడానికి కూడా పోటీ పడేవారని చెప్పారు. విజయ్ డ్యాన్స్ చేస్తున్నా, డైలాగులు చెబుతున్నా అభిమానులు ఆయననే చూస్తూ ఉండేవారు. ఆ క్రేజ్ చూసి నేను షాక్ అయ్యాను. ప్రజలు విజయ్‌ను దేవుడిలా ఆరాధిస్తున్నారనే భావన నాకు కలిగింది అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించారు. షూటింగ్ సమయంలో విజయ్ ప్రియాంకను ఎంతో గౌరవంగా చూసుకునేవారని, కొత్త హీరోయిన్ అయినప్పటికీ ఎంతో సహకరించారని తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు కాస్త కష్టంగా అనిపించిందని, కానీ ఆమె కఠిన సాధనతో తన ప్రతిభను నిరూపించుకుందని చెప్పారు. అలాగే 'తమిళన్' సినిమా అనుభవమే ప్రియాంకను నటనను పూర్తి స్థాయి కెరీర్‌గా ఎంచుకునేలా ప్రేరేపించిందని వెల్లడించారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'తమిళన్' సినిమా విడుదలైన తర్వాత మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ప్రియాంక చోప్రాకే కాకుండా దర్శకుడు మజీత్‌కు కూడా తొలి చిత్రం కావడం విశేషం.

# వారణాసికి బయలుదేరుదాం

### హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్

ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.






# ఒత్తిడి మా వరుస ఓటములకు కారణం

పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సొంత ప్రతిభను నమ్మకపోవడం, ఒత్తిడిని అధిగమించకపోవడం తమ వరుస ఓటములకు కారణమని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ధర్మశాల వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఐపీఎల్ వంటి టోర్నీల్లో ఓటములు సహజమని, కానీ ఎంత త్వరగా పుంజుకుంటామనేదే ముఖ్యమని శ్రేయస్ అయ్యర్ అన్నాడు. టాస్ సందర్భంగా మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. ధర్మశాల పిచ్ ఎలా ఉంటుందో ఆడే వరకు తెలియదన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే.. ఈ వికెట్ మీద ఆడితే తప్ప ఇది ఎలా స్పందిస్తుందో నాకు తెలియదు. కాబట్టి ఏ పరిస్థితి ఎదురైనా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం ముఖ్యం. వ్యక్తిగతంగా.. పాయింట్స్ టేబుల్ గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ సీజన్ అంతా మనం పాటిస్తున్న చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టాలి. మనపై మనకు నమ్మకం ఉండాలి. ప్రతీ ఆటగాడు మ్యాచ్‌లు గెలిపించే బాధ్యతను తీసుకోవాలి. గత రెండు మ్యాచ్‌ల్లో మా జట్టులో లోపించింది ఏంటంటే.. సొంత ప్రతిభను నమ్మకపోవడం, ఒత్తిడిని అధిగమించలేకపోవడం. ఈ టోర్నీలో ఎత్తుపల్లాలు సహజం. కానీ మనం ఎంత త్వరగా పుంజుకుని అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తామన్నదే ముఖ్యం. లాకీ ఫెర్గూసన్‌కు చిన్న గాయం కావడంతో అతని స్థానంలో బెన్ ద్వార్షుయిస్ జట్టులోకి వచ్చాడు.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు. టాస్ గెలిచిన అక్షర్ పటేల్.. బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ గురించి తెలుసుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. మాకు ప్రస్తుతం కలిసి వస్తున్న ఏకైక విషయం టాస్ గెలవడం. 12 మ్యాచ్‌ల్లో 9 సార్లు టాస్ గెలిచాం. ప్రస్తుతం మా పరిస్థితి చాలా క్లిష్టంగా మారింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో కీలక సమయాల్లో మేం వెనుకంజలో నిలిచాం. అలాగని మేం మరీ దారుణమైన క్రికెట్ ఆడలేదు. ప్లే ఆఫ్స్ చేరడానికి మాకు అవకాశాలు ఉన్నాయి. కానీ మేం దాని గురించి ఆలోచించడం లేదు. మా ఆటను మేం ఆడాలనుకుంటున్నాం. ఇతరులపై ఆధారపడకుండా.. మాదైన శైలిలో క్రికెట్ ఆడాలనుకుంటున్నాం. ఫలితం ఏదైనా సరే ఒక జట్టుగా స్వీకరిస్తాం. గెలిచినప్పుడు



మేం ఎంజాయ్ చేస్తం. ధర్మశాలలో ఇది హై-స్కోరింగ్ గ్రౌండ్. ఇక్కడ ఫాస్ట్ బౌలర్లకు స్వింగ్ లభిస్తుంది. మేం మొదట బౌలింగ్ చేస్తే పిచ్ ఎలా ఉంటుందో ఒక అవగాహన వస్తుంది. అందుకే ఛేజింగ్ ఎంచుకున్నాం. మా జట్టులో ఐదు మార్పులు ఉన్నాయి. అభిషేక్ పోరెల్, సాహిల్ పరాఖ్, డేవిడ్ మిల్లర్, ఆకిబ్ నబీ, మాధవ్ తివారీ జట్టులోకి వచ్చారు.'అని అక్షర్ పటేల్ తెలిపాడు.

# ఆఫ్ఘాన్‌తో తలపడే భారత జట్టు ఇదేనా?

అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ, ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న ఏకైక టెస్ట్ మ్యాచ్ కోసం భారత బ్యాటింగ్ విభాగంలోని ప్రధాన ఆటగాళ్లను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు భారత్‌లో పర్యటించి ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి 10 వరకు చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో జరగనుంది. కాగా, ఈ మ్యాచ్‌కు సంబంధించిన భారత టెస్ట్ జట్టు వివరాలు లీక్ అయ్యాయి. ఇందులో గుజరాత్ టైటాన్స్ స్టార్ ప్లేయర్‌ను తప్పించినట్లు సమాచారం. మ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, బ్యాటింగ్ కోర్ గ్రూపులో సెలక్టర్లు ఎలాంటి మార్పులు చేయడం లేదు. గతంలో శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిస్తారని వార్తలు వచ్చినప్పటికీ, తాజా నివేదికల ప్రకారం గిల్ జట్టులో ఉండటమే కాకుండా జట్టును నడిపించే అవకాశం ఉంది. ఈ జట్టులో కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ వంటి అనుభవజ్ఞులు ఉండనున్నారు. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ బి. సాయి సుదర్శన్ టెస్ట్ క్రికెట్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో (సగటు 27.4), అతని స్థానంలో కర్ణాటక బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. పడిక్కల్ డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గాయాల బెడద దృష్ట్యా, ఈ టెస్ట్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో భాగం కానందున అతనికి విశ్రాంతినివ్వనున్నారు. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల ఎంపిక ఐపీఎల్ పనిభారంపై ఆధారపడి ఉంటుంది. రంజీ ట్రోఫీలో రాణించిన ఆకిబ్ నబీ వంటి కొత్త ముఖాలకు అవకాశం దక్కవచ్చు.

ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడే భారత ప్రాబబుల్ టెస్ట్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, రిషబ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురెల్ (కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, హర్ష్ దూబే, మహమ్మద్ షమీ, అన్షుల్ కాంబోజ్.

# ఐపీఎల్ 2026 నుండి ముంబై ఔట్

ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. చివరి బంతి వరకు టెన్షన్.. టెన్షన్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీనే విక్టరీ కొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై 7 వికెట్ల నష్టానికి 166 పరుగులే చేసింది. 167 రన్స్ టార్గెట్‌ను ఆర్సీబీ చివరి బంతికి చేజ్ చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో కృనాల్ పాండ్యా హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడినా కృనాల్ పాండ్యా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 46 బంతుల్లోనే 73 రన్స్ చేసి.. తిలక్ వర్మ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. 2 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. ఈ గెలుపుతో పాయింట్స్ టేబుల్‌లో టాప్‌కి దూసుకెళ్లింది బెంగళూరు. ఈ మ్యాచ్‌లో ఓటమితో టోర్నీ నుంచి ముంబై ఇండియన్స్ నిష్క్రమించింది. ఇక 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకి కూడా ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. పేసర్ దీపక్ చాహర్ నిప్పులు చెరిగే బంతులతో విరాట్ కోహ్లీని డకౌట్ చేశాడు. కోహ్లీ వరుసగా రెండో మ్యాచ్‌ల్లోనూ సున్నాకే వెనుదిరగడం ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. పవర్‌ప్లే ముగిసేసరికి పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్లను కూడా కోల్పోయి ఆర్సీబీ కష్టాల్లో పడింది. ఆ సమయంలో కృనాల్ పాండ్యా, యువ ఆటగాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కృనాల్



కేవలం 32 బంతుల్లోనే మెరుపు అర్ధసెంచరీ సాధించి మ్యాచ్‌ను ఆర్సీబీ వైపు తిప్పాడు. చివర్లో జితేష్ శర్మ ఆఖరి బంతికి కావాల్సిన పరుగును సాధించి ఆర్సీబీ సంచలన విజయాన్ని నమోదు చేశాడు. ఈ విజయంతో ఆర్సీబీ 11 మ్యాచ్‌లలో 7 విజయాలు, 4 ఓటములతో 14 పాయింట్లు సాధించి రన్ రేట్ ం1.103తో టేబుల్‌లో టాప్‌కి దూసుకెళ్లింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్‌కి కూడా 14 పాయింట్లు ఉన్నాయి కానీ ఆర్సీబీ ముందంజలో ఉంది. ఇక ముంబై ఇండియన్స్ 10 మ్యాచ్‌లలో సుమార్ 6 పాయింట్లు మాత్రమే సాధించి ప్లేఆఫ్స్ ఆశలను కోల్పోయింది.

# భువనేశ్వర్ అరుదైన ఘనత

ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. ముంబైతో ఆదివారం రాత్రి జరిగిన సీజన్ 54వ మ్యాచ్‌లో భువీ అదరగొట్టాడు. తద్వారా 19 ఏళ్ల టోర్నీ చరిత్రలో కేవలం రెండోసారి మాత్రమే నమోదైన ఒక అద్భుతమైన రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. భువీ కేవలం రికార్డు మాత్రమే కాదు, ఎన్నటికీ చెరిగిపోని ఫీట్ లిఖించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో 6 సార్లు 3 వికెట్ల హాల్ సాధించిన రెండో బౌలర్‌గా ఆర్సీబీ పేసర్ భువనేశ్వర్ నిలిచాడు. అంతకుముందు ఈ ఘనతను 2021లో హర్షల్ పటేల్ మొదటిసారి సాధించాడు. అయితే హర్షల్ రికార్డును బద్దలు కొట్టే అవకాశం భువీకి ఉంది. ఎందుకంటే ఆర్సీబీ ముంబైపై తన 11వ లీగ్ మ్యాచ్ ఆడింది. జట్టు మరో 3 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందులో భువీ కేవలం ఒక్కసారి 3 వికెట్ల హాల్ సాధిస్తే హర్షల్ పటేల్ రికార్డును బద్దలు కొట్టవచ్చు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో భువీ 4 ఓవర్లలో కేవలం 23 పరుగులు మాత్రమే ఇవ్వగా, ఎకానమీ 5.80గా ఉంది. ముంబైతో మ్యాచులో 4 వికెట్లు తీయడం ద్వారా భువీ పర్పుల్ క్యాప్‌ను మరోసారి అందుకున్నాడు. భువీ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లలోని 11 ఇన్నింగ్స్‌ల్లో 15.28 సగటుతో 21 వికెట్లు పడగొట్టాడు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శన 4/23గా ఉంది. ఆయన ఎకానమీ 7.46గా ఉంది. భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ కెరీర్ విషయానికి వస్తే.. ఇప్పటివరకు భువీ టోర్నీలో 201 మ్యాచ్‌లు ఆడారు. ఈ మ్యాచ్‌లలోని 201 ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్‌లో 26.17 సగటుతో 219 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అందులో అత్యుత్తమ ప్రదర్శన 5/19గా ఉంది. భువీ ఇప్పటికే 2 సార్లు 5 వికెట్ల హాల్ సాధించగా.. ఆయన ఎకానమీ 7.67గా ఉంది. భువనేశ్వర్ 2011 నుండి ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం రాయ్‌పూర్‌లో జరిగిన ఉత్కంఠభరిత పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై, తెలుగు స్టార్ తిలక్ వర్మ (57) అర్ధశతకంతో నిర్ణీత ఓవర్లలో 166 పరుగులు చేసింది. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లతో రాణించి 'పర్పుల్ క్యాప్' కైవసం చేసుకున్నాడు. అనంతరం 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యా (73) వీరోచిత ఇన్నింగ్స్‌తో చివరి బంతికి లక్ష్యాన్ని చేరుకుంది. ముంబై బౌలర్ కార్బిన్ బాష్ 4 వికెట్లు తీసినప్పటికీ ఆర్‌సీబీ విజయాన్ని అడ్డుకోలేకపోయాడు. ఈ గెలుపుతో 14 పాయింట్లతో ఆర్‌సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరగా, ముంబై.. లక్నో జట్లు టోర్నీ నుండి అధికారికంగా నిష్క్రమించాయి. సోమవారం జరగనున్న తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.



# ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా గుడ్ బై..?

ముంబై ఇండియన్స్‌లో ఏం జరుగుతోంది..? కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిజంగానే గాయపడ్డాడా..? లేదా కావాలనే గత రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడా..? మేనేజ్‌మెంట్‌తో విభేదాల రావడంతో టీమ్‌ను వీడాలని నిర్ణయించుకున్నాడా..? ఈ ప్రశ్నలకు బలాన్ని చేకూర్చేలా ముంబై ఇండియన్స్ అకౌంట్‌ను అన్‌ఫాలో చేసి.. కొన్ని గంటల తర్వాత మళ్లీ ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. తన సోషల్ మీడియా ఖాతాల్లో ముంబై ఇండియన్స్‌కు చెందిన పోస్టులను మొత్తం డిలీట్ చేశాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై.. ఈసారి దారుణమైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే సాధించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. మొదటి మ్యాచ్‌ను విజయంతో ఆరంభించినా.. ఆ తరువాత టీమ్ పూర్తిగా గాడి తప్పింది. రోహిత్ శర్మ గాయం కారణంగా నాలుగు మ్యాచ్‌లు దూరం కావడం.. బుమ్రా వికెట్లు తీయకపోవడం.. సూర్యకుమార్ యాదవ్ పూర్ ఫామ్‌లో ఉండడం.. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలో పాండ్యా విఫలమవ్వడం.. జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ సీజన్‌లో పాండ్యా మూడు మ్యాచ్‌ల్లో ఆడలేదు. పాండ్యా స్థానంలో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో పాండ్యాపై వార్తలు మొదలయ్యాయి. వచ్చే సీజన్‌కు పాండ్యా మరో జట్టులోకి వెళతాడని ప్రచారం మొదలుపెట్టారు. తన మాజీ టీమ్ గుజరాత్ టైటాన్స్‌లోకి మళ్లీ వెళ్లిపోతాడని రూమర్లు అంటూ స్టార్ చేశారు. హెడ్ ఆశిష్ నెహ్రాకు కాల్ చేసి.. 'నెహ్రా.. జీ నేను వచ్చేస్తున్నా..' అన్నాడని ట్రోల్స్ చేస్తున్నారు. హార్దిక్ పాండ్యా గాయంపై ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే కీలకమైన అప్‌డేట్ ఇచ్చారు. పాండ్యా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్నాడని.. వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని వెల్లడించారు. అతని ఫిట్‌నెస్ విషయంలో జట్టు యాజమాన్యం ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోలేదని.. అందుకే ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌కు అతనికి విశ్రాంతినిచ్చినట్లు తెలిపారు. అతని పరిస్థితిని బట్టి వచ్చే మ్యాచ్‌కు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



# కోహ్లీ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్: కృనాల్ పాండ్యా

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీపై ఆ జట్టు ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ అని కొనియాడాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 వికెట్లతో స్టన్నింగ్ విక్టరీ అందుకుంది. కృనాల్ పాండ్యా(46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 73) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ ఆర్‌సీబీని కృనాల్ ఆదుకున్నాడు. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కృనాల్ పాండ్యా గతేడాది కూడా ఈ తరహా మ్యాచ్ ఒకటి ఆడినట్లు గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ మ్యాచ్‌లో తనకు అండగా విరాట్ కోహ్లీ ఉన్నాడని గుర్తు చేసుకున్నాడు. టీమిండియాకు ఆడటమే తన లక్ష్యమని, అందుకోసం తీవ్రంగా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చాడు.' గతేడాది కూడా మాకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పుడు మేం 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోయాం. అప్పుడు కూడా నేనే బ్యాటింగ్‌కు వచ్చాను. కానీ ఆ మ్యాచ్‌లో నా ముందు ఒక 'హూరు' నిలబడి ఉన్నాడు. అతని పేరే విరాట్ కోహ్లీ. విరాట్ కోహ్లీ మరో ఎండ్‌లో ఉన్నప్పుడు పనులు చాలా సులువు అవుతాయి. అతను మైదానంలోకి తీసుకువచ్చే ఆరా, శక్తి మరేదానితోనూ సరితూగవు. ఈ మ్యాచ్‌లో నేను కండరాల నొప్పులతో బాధపడ్డాను. ఆ నొప్పులు కాలి పిక్కల దగ్గర మొదలై తొడ కండరాలు, గ్లూట్స్ వరకు వ్యాపించాయి. నా రెండు కాళ్లు తిమ్మిర్లు పట్టేశాయి. కానీ నేను మాత్రం ఏది ఏమైనా.. మైదానం వీడకూడదని అనుకున్నాను. ఆ నొప్పిని భరిస్తూనే నా జట్టు కోసం పోరాడాలని, నా వంతు సహకారం అందించాలని నిశ్చయించుకున్నా. నేను గతంలోనే చెప్పాను. నాకు ఆరేడేళ్ల వయసున్నప్పటి నుంచే దేశం కోసం ఆడాలనేది నా మొదటి కల. అందులో ఎలాంటి మార్పు లేదు. నా 100 శాతం లక్ష్యం మళ్ళీ భారత్ తరపున ఆడటమే. వచ్చే ఏడాది 2027 ప్రపంచకప్ రాబోతోంది. కాబట్టి నా ప్రయత్నం నేను చేస్తాను.'అని కృనాల్ పాండ్యా చెప్పుకొచ్చాడు.
......



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999